# భ్రష్టజీవి

రచన:

దివాకరుణి వెంకటేశ్వర్లు

★

చిన్నతనంలో తనతో, స్నేహంచేశాడు. నేడు పెద్ద చదువు చదువుతూ తనవద్దకు వచ్చేప్పటికి అరుణ సంతోషం పొంగిపోయింది. మామయ్యవరస—తన తల్లికి తమ్ముడు. కాని యిప్పుడు ఆతల్లి తనకు దూరమయింది. ముసలివాడు—నాన్న మాత్రం వున్నాడు.

అరుణ, తన మామయ్యని చూడగానే సిగ్గుతో ఇంట్లోకి పారిపోయింది "ఓహో! అప్పుడే, సిగ్గుకూడా నేర్చిందే!" అన్నాడు ప్రభాకరం, అరుణ మామయ్య. అరుణ తండ్రి "రా, రా! ప్రభాకరం. ఇదేనేటె రావటం? అంతా కులాసాగావున్నారా—?"

"ఆఁ!" అన్నాడు. అరుణ మంచి నీళ్లు తెచ్చి యిచ్చింది" చిన్నప్పుడు, అడిగినా—పీక ఆరిపోతోందన్నా—మంచి నీళ్లు తెచ్చియిచ్చే దానవుకావు; ఇప్పుడు అడక్కుండానే యిచ్చావు—చాలా విచిత్రంగానే వుందే!......చిన్నప్పుడు మనకి దాహం అసలువుండదు; యెటొచ్చి, పద్నాలుగేళ్లు వస్తేచాలు; చాలా దాహంగావుంటుంది! ఆఁ! చదువు మానేశావా? లేక, ఆ మగపిల్లల బడిలోనే చదువుతున్నావా?"

"ఓ! మానేశానుగా!" అంది.

'మానేయక, యింకెందుకు నాయనా! లోకులు—ఆడ పిల్లలకు చదువు చెప్పిస్తోంటే, లేడీ డాక్టరవుతుందా; నరుసవుతుందా, బిడ్డల్ని కనదు గాబోలును యిహ! అవి, యిష్టంవచ్చినట్టు అడుగుతారు—అడగటం వరకూ వచ్చింది. ఏదో, మొగుడు వుత్తరం రాశినా, మొగుడికి వుత్తరం వ్రాయాలన్నా కొంచెంపాటి అక్షరజ్ఞానాన్ని కల్గించాం' అన్నాడు.

"మామయ్య చిలిపి మాటలు మానకే!" అన్నాడు ప్రభాకరం.

"ఈ రోజుల్లో ఏళ్లకు ముసలివాళ్ళంగాని, మాటలకీ, చేతలకీ యెలాగ ముసలివాళ్ళ మవుతాంరా, ప్రభాకరం?" అన్నాడు నవ్వుతూను.

"మామయ్యా, కాళ్లు కడుక్కుంటావా, స్నానం చేస్తావా?" అరుణ అడిగింది.

"స్నానం ఐంది; కాళ్లు మాత్రం కడుక్కుంటే చాలును! ఇంకా, యీ నిమ్మలూ యివీ యెందుకని; మానేశాను మామయ్యా!"

"శుభం!" అని మామయ్య లేచాడు. స్నానం ముగించుకుని...భోజనాల ముందర యిద్దరూ కూర్చున్నారు. తన తండ్రి దొడ్లో స్నానం చేస్తున్నంత సేపూ, అరుణ ప్రభాకరాన్ని యేవో ప్రశ్నలు వేస్తోనే వచ్చింది.

"మామయ్యా!" అంది, అరుణ—వాలుకుర్చీలో పడుకున్న ప్రభాకరం దగ్గరకివచ్చి.

"అరుణా!" అన్నాడు ప్రభాకరం.

"ఈ సంవత్సరంతో, ఐదు సంవత్సరాలూ పూర్తవుతాయా? ఇకను, యిది ప్యాసయి వుద్యోగంలో చేర్తావా? చదువు సరిపోతుంది గదూ?"

"ఆ మాత్రం తెలియదా? అరుణా! యెందుకీ ప్రశ్నలన్నీని...మామయ్య యెక్కడకు వెళ్లాడూ?"

"అలా వీధిలోకి వెళ్లారు...మామయ్యా! నీకు చదువు వొచ్చిన పెళ్లాం కావాలా? చదువురాని పెళ్లాం కావాలా?" గమ్మత్తుగా అడిగింది.

"నాకు యిద్దరూ కావాల్సివస్తారు!"

"ఓ యబ్బో!" అంది, అరుణ. అని, యిహను మాట్లాడలేదు...తన ప్రశ్నలు సామాన్యుడికి చికాకుగానూ, వెగటుగానూ వుంటాయ్. మామయ్య వాటికి యిచ్చిన సమాధానాలు యెంతో విశాలంగానూ, భవిష్యత్ దృక్పథానికి మార్గవంతంగానూ వున్నాయి.

"మామయ్య పెద్ద చదువు చదువుతున్నాడు. తన్ను పెళ్లిచేసుకుంటే, యెంతో బాగుంటుంది. ఆనందంగా వుంటుంది. నాన్నకూడా, నన్ను ప్రభాకరానికే యివ్వాలనివుంది.

"ప్రభాకరం మామయ్య చాలా మంచివాడు. నన్ను చక్కగా చూడగలడు."

ఇలాగ, ఆమె హృదయం ప్రభాకరానికి అంకితం చేశివేశింది.

♦ ♦ ♦

అరుణ తండ్రి ప్రభాకరం వద్దకు వచ్చాడు. మాటల ధోరణిలో, అరుణను ప్రభాకరానికి యివ్వాలని వక్తం చేశాడు.

"అరుణనా?" అన్నాడు, ప్రభాకరం.

"ఔను!" అన్నాడు అరుణ తండ్రి—ముసలాడు.

ఆరాత్రంతా, ప్రభాకరం మనస్సు చికాకుగానే వుంది. అరుణను తను పూర్తిగా కోరలేదు. ఇప్పుడు కోరటమూ లేదు. కాని, తన మనస్సంతా యిప్పుడు మరో అమ్మాయి మీద లగ్నంచేశాడు. ఆ అమ్మాయి కూడా ప్రభాకరం కోసం త్యాగం చేయగల దిట్ట. "ఊఁ!" అంటే, ఎగిరి లేచివచ్చే, పిట్ట! యెంత కాదన్నా' తనతో చదివిన రమామణి!

మామయ్యకూడా, అరుణను తనకు యివ్వాలని వుందని యింతకు పూర్వం చెప్పివుంటే, ఈపాటికి యీ కథ యింతగా అడ్డం తిరిగేది కాదని తనకూ తెల్సును! నిజంగా యీ విషయం యింతకు పూర్వం తెలిసివుంటే, తనలో యేంతో పరిణామం కల్గేది—అది మాత్రం వాస్తవం. మామయ్య, యిప్పుడు పీకమీద కూర్చుని అరుణను పుస్తికట్టమంటున్నాడు. చిన్ననాటినుంచీ, తనను సాకుతూ వచ్చాడు. ఇప్పుడు, సరిగా మామయ్యమాటలు నిరాకరించక తప్పదు!

"ఆలోచిస్తానులే, మామయ్యా! అయినా నాకు యిప్పుడు తొందరేంలేద్దూ! పెళ్ళేకదూ! ఎప్పుడో, ఒకప్పుడు చూడవచ్చును లెద్దూ!" ఇలాగని ప్రభాకరం, యిష్టం లేనట్లు మాట్లాడేప్పటికి, ముసిలి తలతాయ కొంచెం తిరిగింగి! హృదయం చెలించింది.

"పెళ్ళి పెత్తనం కన్నవాళ్లు వొదులుకుని, ఆకుట్టి వాళ్లకే వదిలితే, పెద్దవాళ్లకి పంగనామాలు పెట్టకమానేరా?" అని, ఆముసలివాడు అనుకున్నాడు.

"ప్రభాకరం మామయ్య యెంత మారిపొయ్యాడూ? ఇలాటివాళ్లని నమ్ముకుని, దారికొస్తాడు అని అనుకుంటూ కూర్చుంటే, వయస్సు మీారే, నావంటివాళ్లగతి యేంకానూ?

"ప్రభాకరంకు కూడా హృదయం లేదనిమాట! ఎంత తియ్యటి మాటలు చెప్పేవాడూ" అని, అనుకుంది తండ్రి తెచ్చిని వార్తని విని.

అరుణకు మరో పెళ్లి సంబంధం కుదిరింది. పెళ్లి జనులు జోరుగా సాగుతూనే వున్నాయి.

ప్రభాకరానికి తనే చెప్పాడు—అరుణ పెళ్లికి వచ్చి వెళ్లమని కాని, ముసలాడి మాటలని పెడచెవిని పెట్టి ప్రభాకరం పెళ్లికి రాలేనని మాత్రం చెప్పాడు..." పో, అరుణా! నూవు ప్రేమించిన ప్రభాకరం హృదయం ఇప్పటికయినా తెల్సుకున్నావా?" అని అనుకుంది అరుణ మనస్సు!

పెళ్లినాటికి . అందేట్టుగా, ప్రభాకరానికి అరుణ యీక్రింది విధంగా వుత్తరం వ్రాశింది.

"ప్రభాకరం మామయ్యకు,

నమస్కారాలు. ఖిన్న హృదయంతో, వ్రాస్తాస్నట్టి యీ వుత్తరాన్ని నూవూ చదవగలవనే, దృఢ నిశ్చయంతో వ్రాస్తున్నాను. మనస్నేహం యీనాటిదీకాదు; అందరి స్నేహం వంటిదీకాదు. తప్పని సరిగా—నీకై అంకితం చేశిన నామనస్సుని—ఇహాను మరొహారికి అప్పగిస్తున్నందుకు నేను చాలా చింతిస్తున్నాను. నన్ను మాత్రం నూవు 'హృదయం లేనిదానిగా' భావించవని తెల్సును; నిన్ను మాత్రం నేను 'హృదయం లేనివాడినిగా' భావిస్తావనీ తెల్సు. కాని, నీలోకల్గిన యీ అవాంతరమైన మార్పువల్లనే, నన్ను—నాతండ్రీ, నీవూ – నర్మొకలోకంలో విడిచి వెళ్లుతున్నారు. ఇహాను యీ విషయంలో చింతించేది యిద్దరు మాత్రం వున్నారు; మొదటివాడు నాతండ్రి, రెండో వ్యక్తివి నువ్వు!

"వాంఛలను తీర్చ శక్తి లేనట్టివాళ్లు, లోకంలో తలెత్తుకు తిరగవలసిన వాళ్లని యిలాగా అవమానం పరుస్తం భావ్యంకాదు.

"నీవల్లను నేను నాజీవితంలో ప్రప్రథమంగా భ్రష్టత్వం సంపాయించాను. కాని, నీ మనఃపూర్తిగా చేశిన యీ అకార్యానికి నూవు చింతపొందకు, నేనూ విచారించనని ముమ్మాటికీ చెప్పగలను. ఎందువల్ల పొందలేదు! పొందితే, — తప్పకండా ప్రస్తుత పరిస్థితి సంభవిస్తే — నేను ఆత్మహత్యనే చేసుకునే దాన్నేనేమో !......"

అరుణకు వివాహమయింది...కట్నాల బాధమాత్రం వుందని గమనించండి !

అరుణ భర్తపేరు — నరసింహారావు. ప్రభాకరం అంతటి అందంగానూ, అంతతీవిగానూ వుంటాడు. చదువుకున్నాడు. పోతే, చెడు అలవాట్లు మోతాదు మాత్రంజాస్తి. తను యెంతంటే, అంత! ఈ విధానం అరుణకు నచ్చటంలేదు. అరుణ అమాయికురాలు. వచ్చిన కొత్తలో, ప్రభాకరం గూర్చి కొంచెం పరధ్యాన్నంగా వుండినా, యిప్పుడు నరసింహారావుతో చనువుగా మాటాట్టం, కలసి—మెలసి తిరగటం, ఖులాసా కాలక్షేపాల్లో మిక్కిలిగా పాల్గోటం ప్రారంభించింది......అత్తా — ఆడ బిడ్డలు లేదా, అని ఘుటికులు ప్రశ్నించావచ్చు! సమాధానం లేరని పొందావచ్చు !!

నరసింహారావును, అరుణ హృదయ పూర్వకంగా భర్తని చూసే దృష్టితోనే చూడకపోతే, సంఘానికి దడిసిన వ్యక్తులు — 'దుర్బలులు' అంద్దాం ! — యెలా పతనమయిపోతున్నాదో, తనూ అలానే అయిపోతుందని గ్రహించింది. సంఘాన్ని వ్యతిరేకించి, సర్వ స్వతంత్రంగా, కొన్ని హద్దులను మీరకుండా, నడుచేవారి వుత్తమ జీవితాలలోని మధురఘట్టాలు చాలా వున్నాయి; కాని వాటిని నమ్మేటంతటి శక్తివంతురాలు కాదు. ఇట్లాంటి శక్తిహీనులతో కూడిన యీ సంఘం పతనం పొందుతోంది. శక్తివంతులు — సంఘాన్ని వ్యతిరేకించినవారు—బలవంతులు అవుతున్నారు.

నరసింహారావు యొక్క హృదయం విశాలం లేనిది. గ్రుడ్డి చూపుగా వుంటుంది అతని వ్యవహారం. తలతిక్క మనిషి కాక పోయినా, అందరూ అలాగే అనుకుంటారు !

"మీరు దాసుగారి యింటికి ప్రతి ఘడియకూ వెళ్లుతూ వుంటారు — దేనికి ?" అని అడిగింది అరుణ.

"అది నాయిష్టం — నీకెందుకూ ?"

"నలుగురూ చూస్తే నవ్వుతారు ; నలుగురిలోనూ వుత్తమపథంలోవున్న మీవంటివారు చేయాల్సినట్టి పనులు కావు !"

ఆ విషయం నూవు చెప్పాల్సింది కాదు !" నరసింహారావు అక్కడనుంచి వెళ్లిపోయాడు.

"జీవితంలోని మధుర తరంగాలలో పాదం పెట్టిన నాటి నుంచీ, యిలాంటి విషయాలే, నన్ను వేధించుకుని తింటున్నాయి. పతనస్థితిలోకి తీసుకుని రాప్రయత్నిస్తున్నాయి — ఇట్లాంటి వ్యతిరేక శక్తులు. కాని, నేను నా కాళ్లమీద నిలబడగలననే ధైర్యం కల్గుతోంది."

ఇలాంటి దృఢనిశ్చలత్వంలోవున్న అరుణని భర్త నరసింహారావు — తనను ఒంటరిదాన్నిగా చేశి, ఊడాయించాడు !

మతి చలించి, ఆమె యిష్టం వచ్చినట్లుగా సంచరిస్తూ, జీవితం మీద విరక్తిజనించి, నదిలో పడిపోయింది.

బ్రతికీ — అధమస్థితికి వచ్చింతర్వాతను — ఆమె ఒక్క వాక్యం అనుకుంటూ వుండేది.

"వ్యక్తులు, నా జీవితాన్ని ఒక్క కథగా తప్పకండా చెప్పుకొనే అవకాశం వుంది. ఆకథకి తుది వాక్యంగా, "అరుణ ప్రేమించిన కుఱ్ఱాడు మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు" అని, అనుకుంటారు కాని, సానుభూతి చూపి, తోటి మానవుల్లో కల్గిన యీరకం కుళ్లును ఒక్కళ్లూ మొదలంటా తీశేయరే ?" అని.

---

## ఇండియాకు అరగంటలో...

ప్రిమర్ కాబిన్ గదులు ఏర్పాటు చెయ్యబడిన రాకెట్ విమానాలు బ్రిటన్ నుంచీ అరగంటలో ఇండియాకు ప్రయాణీకులను తీసుకువచ్చేరోజు తర్వలో రానున్నదని బ్రిటిష్ పౌర విమానశాఖ డైరెక్టర్ జనరల్ పీటర్ మేస్ఫీల్డ్ జోస్యం చెబుతున్నాడు.